క్లుప్తంగా

శాఖాగ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'


విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథాలయ నిర్వాహకుడు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.మధుసూదనరావు ఆధ్వర్యంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో సంఘ సంస్కర్తల జీవిత విశేషాలను, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను చదివించి, అందులోని అంశాలను వివరించారు. అలాగే విద్యార్థులకు వివిధ రకాల ఆటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు భామిని కేజీబీవీ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఓ శారద, పీఈటీ తేజేశ్వరి

భామిని: స్థానిక కేజీబీవీకి చెందిన 11 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్ఓ బూరాడ శారధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్–14 విభాగంలో నలుగురు, అండర్–17 విభాగంలో ఏడుగురు విద్యార్థులు వివిధ రకాల పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు. విజేతలను ఎస్ఓతో పాటు పీఈటీ టి.తేజేశ్వరి అభినందించారు.

యువత భక్తిభావం కలిగి ఉండాలి


శోభలతాదేవి కాలనీలో యువతకు వినాయక విగ్రహాన్ని వితరణ చేస్తున్న కోటేశ్వరరావు

కురుపాం: యువత భక్తిమార్గం వైపు మొగ్గు చూపాలని కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న పలువురు యువకులకు ఆదివారం గణపతి విగ్రహాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని కోరారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ఎలాంటి గొడవలు లేకుండా, సోదర భావంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు.

రహదారి గోతుల పూడ్చివేత


సింగిడి వద్ద రోడ్డుపై గోతుల పూడ్చివేత పనులు

భామిని: ఏబీ రోడ్డులో ఏర్పడిన గోతులను బత్తిలి పోలీసులు దగ్గరుండి పూడ్చివేశారు. ఎస్సై యతిరాజుల అమ్మనరావు ఆధ్వర్యంలో పసుకుడి సర్పంచ్ భార్గవనాయుడు సహకారంతో గోతుల పూడ్చివేత పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏబీ రోడ్డులో సింగిడి సమీపంలో గోతులు ఏర్పడ్డాయి. రాకపోలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను తాత్కాలికంగా పరిష్కరించేందుకు పోలీసులు ముందుకొచ్చారు. ట్రాక్టర్లతో స్టోన్‌మిక్చర్‌ను తెప్పించి గోతుల్లో వేసి జేసీబీతో చదును చేయించారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం


హోమంలో పాల్గొన్న దంపతులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి మందిరంలో ఆదివారం దేవి సహిత జైగురుదత్త హోమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కాకడహారతి, విశేష అర్చనలు, అభిషేకాలు, తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో ఆలయ అర్చకులు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జైగురుదత్త హోమాలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


గరుగుబిల్లి: పూజలందుకునేందుకు సిద్ధమైన లంబోధరుడు


వీరఘట్టం: ముచ్చర్లవీధిలో ఏర్పాటు చేస్తున్న మండపం


గరుగుబిల్లి: వ్యాన్‌లపై వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న యువకులు

తొలిపూజకు సర్వం సిద్ధం

గ్రామాలు, పట్టణాల్లో వినాయక చవితి సందడి నెలకొంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాల నిర్వహణకు ఇప్పటికే యువత పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. భారీ మండపాలను ఏర్పాటు చేశారు. వివిధ రంగులతో, విద్యుత్ కాంతులతో వాటిని అలంకరించారు. గణపతి విగ్రహాలను ఆటోలు, ట్రాలీలపై మండపాలకు తరలించే పనిలో ఉత్సవ కమిటీలు బిజీగా ఉన్నాయి. మరోవైపు చవితి కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడుతూ కనిపించాయి. పండ్లు, పూలు, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చినవారితో మార్కెట్లు కిటకిటలాడాయి. ఉత్సవాల నిర్వహణకు ముందుస్తు అనుమతులు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో పండగను చేసుకోవాలని పోలీసులు సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ఈ మేరకు పలుచోట్ల మట్టివిగ్రహాలను పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


వీరఘట్టం: కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్


వీరఘట్టం: మార్కెట్‌లో కొనుగోలు చేసిన విగ్రహాలను గ్రామాలకు తరలిస్తున్న యువకులు


గరుగుబిల్లి: పెద్దూరులో ఏర్పాటు చేసిన వినాయక మండపం


భామిని: గురండి కూడలిలో గణపతి ప్రతిమలు కొనుగోలు చేస్తున్న భక్తులు

30 నుంచి ఆరోగ్య సురక్ష శిబిరాలు

గుమ్మలక్ష్మీపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయాల్లో ఈనెల 30 నుంచి ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్, రెవెన్యూ శాఖల సంయుక్త పర్యవేక్షణలో ప్రజలకు ఆరోగ్య సేవలందించనున్నట్లు తెలిపారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి వైద్య సేవలందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈనెల 30న పి.ఆమిటి, అక్టోబర్ 3న బాలేసు, 4న జర్న, 5న ఇరిడి, 6 వనకాబడి, 7 చాపరాయి బిన్నిడి, 9న దుమ్మంగి, 10న రాయగడ జమ్ము, 11న చినగీసాడ, 12న చెముడుగూడ, 13న గొయిపాక, 16న మండ, 17న బీరుపాడు, 18న రెల్ల, 19న నెల్లికెక్కువ, 20న లుంబేసు, 21న కుక్కిడి, 24న కొండవాడ, 25న కేదారిపురం, 26న ఎల్విన్‌పేట గ్రామ సచివాలయం–2లో, 28న గుమ్మలక్ష్మీపురంలో, 31న ఎల్విన్‌పేట గ్రామ సచివాలయం–1 వద్ద ప్రత్యేక వైద్య బృందాల పర్యవేక్షణలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

పంటలు బాగా పండాలని ప్రార్థిస్తూ..

కురుపాం: ఈ ఏడాది పంటలు బాగా పండాలని కోరుకుంటూ మండలంలోని మొండెంఖల్ గిరిజన గ్రామంలో ఆదివారం కలగొప్పులు నిర్వహించారు. గ్రామపెద్ద ఇంటికుప్పల సూర్యనారాయణ, గ్రామ సర్పంచ్ గౌరీశంకరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. తుమ్మిక కర్రలకు రక్తం పూసి పంట పొలాల్లో పాతారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుడారి వైకంఠం, ఇంటికుప్పల రామకృష్ణ, గుడారి రామారావు, గౌడు బుల్లు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


మొండెంఖల్ కలగొప్పులు పండగ నిర్వహిస్తున్న గిరిజన రైతులు

అర్హుల చెంతకే సంక్షేమ లబ్ధి

పాలకొండ రూరల్: జగనన్న ప్రభుత్వంలో అర్హుల వద్దకే నేరుగా వెళ్లి సంక్షేమ పథకాలు అందించటం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ అన్నారు. పలు గ్రామాల సర్పంచ్‌లతో కలిసి ఆదివారం నూతన పింఛన్ల పంపిణీపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 32 పంచాయతీల్లో కొత్తగా 345 మందికి సమాజిక పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి వివిధ సాంకేతిక కారణాలతో పింఛన్లు పొందనట్లయితే అటువంటి వారి సమస్యలను పరిష్కరించి త్వరలోనే పింఛన్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కర్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా మండలంలో రూ.14.13 కోట్లతో చేపడుతున్న తాగునీటి వసతులు మెరుగు, నూతన నిర్మాణల పూర్తికి ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, సర్పంచులు ఎస్.విజయ్‌కుమార్, కె.దాము, ఎంపీటీసీ ఎం.నవీన్, కె.సూర్య తదితరులున్నారు.


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్

పురస్కారం మంజూరుపై హర్షం

గుమ్మలక్ష్మీపురం: శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపకులు, అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కు ప్రతిష్టాత్మకమైన డాక్టర్ బోయి భీమన్న జీవిత సాఫల్య పురస్కారం లభించడం గర్వించదగిన విషయమని శ్రీశ్రీ కళావేదిక పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పాలక దేవానంద్ అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. కళలు, కవులను ప్రోత్సాహించడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ప్రతాప్‌ను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేయడం శుభపరిణామమన్నారు.

అద్భుత సృష్టికర్త విశ్వకర్మ

- ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

పాలకొండ రూరల్: సృష్టిలో ఎన్నో అద్భుతాలను తన నైపుణ్యంతో స్వయంభూ అయిన విశ్వకర్మ సృష్టించారని పాలకొండ శాఖాగ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు గ్రంథాలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ముందుగా విశ్వకర్మకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాణాల్లో చెప్పిన విధానంలో శ్రీకృష్ణుని ద్వారక, పాండవుల ఇంద్రప్రస్థానం వంటి అద్భుత భవనాలతో పాటు ఆభరణాలు, ఆయుధాలను విశ్వకర్మ సృష్టించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.షణ్ముఖరావు, జి.మురళి, భాస్కరరావు, రాంబాబు, కడియం శ్రీనివాసరావు, దీపిక, పాఠకు లు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయంలో విద్యార్థులతో మట్టి గణపతి విగ్రహాలను తయారుచేయించి స్థానికులకు అందించారు.

- పాలకొండ: పట్టణంలోని ఇందిరానగ్ కాలనీలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఉత్సవాలను ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవలస దవళేశ్వరరావు, రణస్థలం రాంబాబు, వైశ్యరాజు గోవిందరాజు, ఆర్తిముడి బ్రహ్మం, సుగంధం నారాయణరావు, ఆగూరు ప్రసాద్, ఇంతాడ మోహన్, చెరుకూరి బాలబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.
- వీరఘట్టం: స్థానిక విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను వీరఘట్టంలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ బూరాడ లక్ష్మీకాంతం, ఆ సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు బూరాడ లక్ష్మీనారాయణ ఆచారి తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


భామిని: బత్తిలిలో విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న విశ్వబ్రాహ్మణులు


వీరఘట్టం: విశ్వకర్మకు పూజలు చేస్తున్న స్థానికులు


పాలకొండ: విశ్వకర్మ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

- భామిని: విశ్వాన్ని సృష్టించిన శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతిని బత్తిలిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి మండపంలో ప్రతిష్టించి పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి హోమాలు చేశారు. పూజా కార్యక్రమంలో పంచకుల వృత్తిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉమారామలింగేశ్వర విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. విశ్వకర్మ జయంతి రోజున విశ్వకర్మ యోజనను ప్రారంభించిన మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.బ్రహ్మాజీ, సీహెచ్.తవిటాచారి, ఎ.శంకరరావు, కె.తిరుపతిరావు తదితరులున్నారు.


పాలకొండ రూరల్: శాఖా గ్రంథాలయంలో విశ్వకర్మ జయంతి కార్యక్రమం

గిరిజన గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- రూ.5.68 కోట్లతో బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని జి.శివడ పంచాయతీ పరిధిలో జి.శివడ నుంచి రాముడుగూడ, మడ్డుగూడ, ఎగువ కీడవాయి, నాంద్రగండ, వేపమానుగూడ గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు రూ.5కోట్ల 68 లక్షలతో బీటీ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఆదివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. రోడ్డు సౌకర్యం ఉంటే గ్రామాల అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. గత ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమాన్ని గాలికొదిలేయడంతో గిరిశిఖర గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, తదితర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను చేరవేస్తున్నట్లు చెప్పారు. మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, జి.శివడ సర్పంచ్ మిన్నారావు, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, గుజ్జువాయి సర్పంచ్ హిమరిక నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు రంగారావు, మొండెంఖల్ ఎంపీటీసీ గుడారి విద్యారాణి, స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అనిమి ఇందిరాకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ వ్యాపార విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నిమ్మల వెంకటరావు, గులిపల్లి రాజారావు, షేక్ ఆదిల్, రేవు సత్తిబాబు, బిడ్డిక అనంత్, ఆకుల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.


రహదారి నిర్మాణ పనులకు భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పోలీసులకు సహకరించాలి: ఎస్సై

పాలకొండ రూరల్:

పండగల నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్సై బి.శివప్రసాద్ కోరారు. సోమవారం నుంచి ప్రధాన రహదారితో పాటు పలు కూడళ్ల వద్ద వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం సిబ్బందికి సూచనలు చేశారు. పాలకొడ–శ్రీకాకుళం, విశాఖ, వీరఘట్టం రహదారుల్లో అనుసరించాల్సిన ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కోటదుర్గమ్మ దేవస్థానం కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన మార్కెట్, వ్యాపార సముదాయాల వద్ద సిబ్బంది నిత్యం పర్యవేక్షించాలన్నారు. అనుమానితుల కదలికలపై దృష్టిపెట్టాలని సూచించారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్సై

చంద్రబాబు అరెస్ట్ కరెక్టే..!

గుమ్మలక్ష్మీపురం: 'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్'(ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో మాజీ సీఎం, తేదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును అరెస్ట్ చేయడం చట్టబద్ధమేనని జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అడ్డాకుల చిన్నారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడుతూ.. సీఐడీ నమోదు చేసిన సెక్షన్లు సరైనవేనని న్యాయస్థానం నిర్ధారిస్తూ ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. టీడీపీ నాయకులు వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించడం విడ్డూరంగా ఉందన్నారు. దీనికి ఎల్లోమీడియా వంతపాడుతూ సొంత తీర్పులు ఇచ్చేస్తూ, పతాక శీర్షికల్లో కథనాలను ప్రచురించడం వెనుకగల ద్వంద్వనీతిని విజ్ఞులైన ప్రజలు గమనిస్తున్నారన్నారు. 'జనసేనాని' పవన్ కళ్యాణ్ ఉడుతాభక్తిని ప్రదర్శించడం తన పిల్లచేష్టలకు పరాకాష్ఠ అనక తప్ప దని చిన్నారావు పేర్కొన్నారు.